# వంతెన

అది ఓ ఊరు. ఆ వూరికి పడమటి భాగాన పైన చెరువు. ఆ చెరువు నుండి తూర్పుకు ఎప్పుడో తవ్వించిన కాలువ. కాలువకు ఇటువైపు ఊరు. అటువైపు దళిత వాడలు. ఆ వాడల్లో కొన్ని పూరిళ్ళు. కొంచెం పైకి కొత్తగా ప్రభుత్వం కట్టించి ఇచ్చిన ఓ గది, వరండా పెంకుటిండ్లు. ఆ ఇండ్లకు పైన ఓ పెద్ద ఊడల మర్రి. ఆ మర్రి కింద ముత్యాలమ్మ గుడి. అక్కడే దళితులంతా తమ బోనాలను పెట్టుకుంటారు. గుడి ముందున్న పందిరికి మేకల, గొర్రెల కాళ్ళు వేలాడుతున్నాయి. గుడి పక్కమ్మటే గుడెత్తు పుట్ట పెరిగి వున్నది. దానిపై పసుపు కుంకుమ చల్లిన గుర్తులు.

కులాల వారిగ దేవతలున్నారు కదా! మన దేశంల్లో.

పప్పు బెల్లానికి ఉప్పు మిరపకాయలకు కాలువదాటి ఊళ్లోకి వచ్చిపోవలసి వుంటుంది. వర్షాకాలంలో తాటి దూలాలను పరిచి వాటిపై నుండే రాకపోకలు. ఎన్నో జన్మభూమి కార్యక్రమాలు వచ్చిపోయినయి. ఆ వాడల స్థితి గతులపై ఎవరిదృష్టి పడలేదు. పడనీయలేదు. ఈ సారి జరిగె జన్మభూమి కార్యక్రమంలో నోడల్ అధికారి దృష్టి పడగా కాలువ దాటి ఆ వాడలల్లో అడుగుపెట్టాడు. ఆయన రాకను చూసి పుట్టు దరిద్రులు, రోజు కూలి పేదవాళ్ళు చుట్టు చేరి తమ తమ సమస్యలను చెప్పుకొంటువున్నారు. తమ బతుకులు జంతువులకంటె అధ్వాన్నమని, రైతుకూలీలుగ పత్తి పండించినా ఒంటి నిండా గుడ్డలేదని, చేసిన కష్టం ఎటు పోతుందో, ఏసిన ఓటు ఎటు పోతుందో కూడా తెలియదు అన్నారు.

"దేశమంతా దీపమని, వెలుగని ఏమేమో ప్రభుత్వం ఇస్తుందట. ఇప్పటివరకు మా వాడలకు ఏదీ రాలేదు. ఈ రోజు మీరొచ్చి మమ్ముల పల్కరిస్తున్నరంతె. ఎవరొచ్చిన ఊళ్లోకేవచ్చి ఊళ్ళోనుండే పోతువున్నారు. మా పిల్లలు బడిలో గూడ చదవనోచుకోలేదు. బడి ఊల్లో వుండేసరికి కాలువ దాటి పోవాలంటె పిల్లలు కాలుజారిపడిపోతరని బయపడుతుంటిమి. దేశంలో అందరు బాగుపడిపోతున్నరు మరిఈ వాడలెందుకు బాగుపడవో తెలవదు" అన్నాడు దళిత వాడ పెద్ద చింతల రామయ్య. తన చేతి కర్రను సంకకింద ఆసరగా వుంచుకోని, తలపై చినిగిన కండవాను చుట్టుకొని అర్ధ నగ్నంగా నిలుచున్నాడు. అతని చుట్టూ తన జనం. వాళ్ళ వేషధారణ అట్టాగే వుంది.

ఉన్నట్టుండి 'పాము, పాము' అని ఓ యువతి చివరి గుడిసెలో నుండి

బయటకు పరిగెత్తుకొచ్చింది. మనిషంతా వనికిపోతు వుంది కళ్ళలో బెదురు కొట్టొచ్చినట్టు కనిపిస్తువుంది. కట్టుకున్న చీరె కొంగు తొందరలో జారి కాళ్ళ మధ్య వేలాడుతు పరుగుకు అడ్డం వస్తు వుంది.

"ఎం పాము" అన్నాడో యువకుడు ఆయన చేతిలో ఓ ముల్లు కర్రవుంది.

"ఇంకేం పాము తాసుపామే, బారెడుంది. దండం కూడా పెట్టిన" అన్నది ఎగపోస్తున్న గొంతుతో. జారిన కొంగును భుజాన వేసుకుంటు.

"దండం పెడితె దగ్గర్కి రాదా?" అడిగాడు నోడల్ ఆఫీసర్ ఆశ్చర్యంగా.

"రాదు దొర" అంది ఎదమీద చేయి వేసుకొని గుండెను అదుముకుంటు అప్పుడు పదయింది. ఎండ ముదురుతుంది.

"అదివట్టిదే, దండన వుంటేనే అవి వెనక్కు తగ్గుతాయి" అన్నాడు.

ఈ లోపు చేతికర్రతో ఆపామున్న గుడిసెలోకి వెళ్ళిన యువకుడు కాసెపట్లో పామును చంపి తోక పట్టుకొని బయటకు తెచ్చి, దాని నోట్లో ఓ రాగి నాణెం పెట్టి కంప కట్టె వేసి తగులపెడుతూ వున్నాడు. చిన్న పిల్లలు చుట్టూ మూగి వున్నారు.

"ఇది ఇంట్లోకే వచ్చిందే, ఇంటి చుట్టు చెత్త చెదారం లేకుండా శుభ్రంగా వుంచుకొండి" అన్నాడు నోడల్ అధికారి. ఆ వాడ జనమంతా చుట్టూ మూగారు.

"చెత్తచెదారం అట్ట వుంచంఁడి. పూరి ఇండ్లు కద ఎలుకలు ఎక్కువ తిరుగుతుంటాయి. వాటికోసం పాములు వస్తుంటాయి." అన్నాడు మరో పెద్ద మనిషి. ముడతలు తేలిన ముఖం, సీసపు గోలీలలాంటి కళ్ళు, చేతిలో ఓ దుడ్డుకర్ర, నీళ్ళకుండలాంటి రంగు అది నలుపు కాదు, ఎరుపు కాదు. కాయ కష్టం చేసి ఎండలో ఎండి వానలో నాని కూడ మనుషులు ఏ రంగు కాని రంగులోకి మారారు.

వాడంతా ఓ సారి తిరిగి చూసాడు. ఇంటి ముందో వెనకో వేపచెట్లు వాటి కింద ఓ చోట కుక్కలు, మరోచోట పందులు పడుకొని వున్నాయి. అక్కడక్కడ పందిరి గుంజలకు, వేపచెట్లకు మేకలను కట్టేసి వున్నాయి. వాటి వెంట వాటి పిల్లలు. అవి మధ్యమధ్యన తల్లి పొదుగును తలతో కుమ్ముతు, తోకలను ఆడిస్తు పాలు తాగుతున్నాయి. తరువాత వాటిని అడవికి తోలుకపోతారు. వాటిని అమ్మగా వచ్చిన సొమ్మె వీళ్ళ అదనపు ఆదాయం' ఎలాగాయినా వీళ్ళకు కొంత ఆర్థిక సహాయం అందేటట్టు చూడాలి' అని అనుకుంటునప్పుడు-

"అసలు ఈ కులాన్ని ఎందుకు పుట్టించ్చిండో, ఆ దేవుడు ఈల్ల నొదుట ఈ బాదలు ఎందుకు రాసిండో. కరిచే పామెరగక, చంపె దొంగను కానక వండించి ఉప్పిడి ఉపానలెందుకు చావాలె. రోగవెుచ్చినా పావలపైసలుండవాయె ఏం బతుకులు సారు" అంది చింతరామయ్య భార్య ఎల్లమ్మ. ఆమె మోకాళ్ళ వరకు చీరె అదే రంగు రవికె ధరించి వుంది. అవి కాయకష్టంలో రంగు వెలసినయి. రవికె మీద ఉప్పు ఊరిన మరకలు. పాదాల వేళ్ళకు సగం అరిగిన కాళ్ళకు మెట్టెలు. చేతులకు మట్టి గాజులు అవి రంగు వెలిసే వున్నాయి.

"చూడమ్మ ఈ కష్టాలు ఎల్లకాలముండవు. నొదుటి రాతంటు ఏది వుండదు. ఇది దేవుడు చేసింది కానే కాదు. తోటి మనుషులు సృష్టించినయె. ఆ మనుషుల్లో కూడ మార్పును చూస్తాం. కాలం మారుతుంది. రాబోవు కాలంలో ఇవన్నీ ఉండవు." అన్నదు నోడల్ అధికారి ముఖ్యంగా ఊళ్లోకి వెళ్ళి రావడం కష్టమైతుందని వివరించారు. తమ పిల్లలను బడికి పంపుకోలేకపోతున్నం అన్నారు. వాళ్ళ న్యాయమైన కోరికల గురించి ఆలోచిస్తూ కాలువ మీది దూలంపై నడిచి ఊళ్ళోకి వెళ్ళాడు. ఆయన వెంట కొందరు దళిత యువకులు వున్నారు.

ఆ కాలువ మీద రెండు సార్లు వంతెన మంజూరైన అప్పటి సర్పంచ్ పట్టించుకోలేదు. పంచాయితి బోర్డులో వంతెన అవసరమని ఏకగ్రీవంగా తీర్మానించినా అంతకంటె అత్యవసర పనులున్నాయని తప్పించాడు ఆ సర్పంచ్. రిజర్వేషన్ పద్ధతి అమలులో వేరే కులస్తుడు సర్పంచ్ అయ్యేవరకు ఆ పాత సర్పంచే పధవిలోనే వున్నాడు. ఆయనేమో వంతెన పేరెత్తితే చాలు వంటికాలుమీద ఆడేవాడు. ఆ వాడ ఓట్లే తనను సర్పంచ్‌ను చేసింది, 'కాదనను కాని' మా కుటుంబం ఈ వూరికి చేసిన మేలును గుర్తుంచుకోవాలి అంతె అంటూ వుంటాడు. వాళ్ల తాత, ముత్తాతలు ఆ వూరి జమీనుదారులు, దొరలు ఆనడానికి ఆ ఊరి నడిబొడ్డున వున్న పెద్ద బంగళాయె సాక్ష్యం. దాని దర్వాజలు ఆనాటి వాళ్ళ దర్పానికి గుర్తులు. కూలి ఖర్చు లేకుండానే ఆ రోజుల్లో ఆ ఇంటి నిర్మాణం జరిగిందట.

వాళ్ల భూముల్లో పంటలు పండినా పండకపోయినా అల్లం కొమ్ములు వేసినట్టు నాగుల గింజలు, మనిప్లాంట్ మొక్కలాగ మిత్తీలకిచ్చిన డబ్బు పెరుగుతూనే వుంది. అందుకని వాళ్లు ఆర్థికంగా పచ్చగానే వున్నారు. అంతేకాదు పదికాలాలపాటు మహా బాగ బతికే ఏర్పాట్లు చేసుకున్నారు.

వాళ్ల ఆడవాళ్లు గడపదాటి ఎరగరు. పెళ్ళిల ఊరేగింపులలో గూడ పల్లకీలకు పరదాలుండేవి. ఒక్క బిడ్డ వుంటే తన చెల్లెలు కొడుక్కే ఇచ్చుకున్నాడు.

కొడుకు బీదు భూములను అమ్మి బోరు మిషన్లను కొని వేరే రాష్ట్రాలలో పనిచేయించుకుంటు సంపాదిస్తున్నాడు. ఊరు పట్టుకొని ఊరి రాజకీయాలను చేతిలో పెట్టుకొని దొర ఊళ్లోనే వుంటున్నాడు. బాగానే వుంది కాని ఆయన ఆలోచనాపరిధిని పెంచుకోలేక అదే భూస్వామ్య మనస్తత్వంతోనే తమ ఆధిక్యతను కనబరుచుతూవుంటాడు. కూలి రైతు అయితే ఆయనకు కుతకుత. బండితోలెవాడు ట్రాక్టర్ నడిపితె ఆయనకు బాధ. మాల మాదిగ పిల్లలు బడికివెళ్లితె ఆయనకు వళ్లుతూలుతది. 'అందరు చదివితె ఊళ్లో పనులెవ్వరు చెయ్యాలని' అప్పుడప్పుడు అడుగుతు వుంటాడు. ఈయనకు ఈలాంటి బాధలు మరెన్నో అందుకె అప్పుడప్పుడు కళ్లమంట, కడుపుమంట అని ఆసుపత్రికి వెలుతుంటాడు. ఎట్లయితేనేమి ఆయన కాలంలో కాలువ మీద వంతెన కట్టించలేకపోయాడు. ఈ సారి గ్రామసభను చావడిలోని వేపచెట్టు కింద ఏర్పాటు చేసారు. అంతకు ముందు గ్రామసభలు దొరవారి బంకుళ్లలోనే జరిగేది.

"కార్యాలయం కట్టించేవరకు చావడి, చెట్టునీడె చాలు. ఎవరి ఇంట్లోనూ వద్దు" అన్నాడు కొత్త సర్పంచ్.

"వంతెనను వెంటనే ప్రారంభించాలి" అన్నాడు సర్పంచ్ మళ్ళీ తానె.

"ఇప్పుడంత అవసరమా" అన్నాడు మాజీ సర్పంచ్ వెటకారంగా.

"అవసరమే వంతెన కడితెగాని, అవతలి వాళ్ళకు సౌకర్యంగ వుండదు?" అని అన్నాడు నోడల్ అధికారి.

అది విన్న మాజీ సర్పంచ్ "అయ్యా మీదేకులమో మీ పేరేందో తెలియదుకాని ఆ కులం వాళ్లమీద మీకు ఎక్కువ ప్రేమ వున్నట్టుంది. మీ ఆలోచనంతా వాళ్లమీదే వున్నట్టుంది" అన్నాడు భాదగ రాత్రి రాళ్ళ వాన పడడం వల్ల ఉదయం ఉబ్బరంగా ఉంది.

"నా పేరు ప్రసాద్. ఒక్క నా ఆలోచనే కాదు ఒకప్పుడు మహాత్ముని ఆలోచన వాళ్లమీదే వుండేది, ఇప్పుడు ప్రభుత్వం ఆలోచనా వాళ్లమీదేవుంది. అందుకె వాళ్ల బాగోగుల గురించి ఇన్నీ పథకాలు, ఫండ్స్. ఓ ఉద్యోగిగా నా పని నేను చేయవల్సిందేగదా?" అన్నాడు. నుదుటికి పట్టిన చెమటను దస్తితో అద్దుకుని, దానినే మెడ దగ్గర అటు ఇటు ఊపుకుంటు.

"పన్నులు కట్టేది ఒకరైతె ఫండ్స్ మరొకరికా?" అన్నాడు మాజీ సర్పంచ్.

"మీరనుకునేది సరియైందికాదు" అన్నాడు ప్రసాద్ కూల్‌గ.

"ఏది సరియైందో చెప్పలేను కాని వాళ్ళకు కష్టపడి బాగుపడమని చెప్పండి" ఓ మాదిరిగ ముఖం పెడుతూ.

"వాళ్లు కష్టపడేది చూస్తున్నాంగ మీకు మాత్రం తెలియదా?" అప్పుడే ఓ రైతు చొప్ప బండిని అక్కడ నుండి తోలుకొని వెడుతున్నాడు.

"మరెందుకు బాగుపడరు. ప్రభుత్వమే ఎందుకు బాగుచేయాలి" అన్నాడు వెటకారంగా నర్సింగ్‌రావు.

"వాళ్ల కష్టం జనం కోసం, దేశంకోసం వాళ్లు రోడ్లేసేది, రోడ్లను ఊడ్చేది. పారించేది, పండించేది. బస్తాలు మోసేది బండ్లు నడిపేది వాళ్లె, చెరువులు వేసేది వాళ్లే, కాలువలు తవ్వింది వాళ్లె. ఇప్పుడిప్పుడు కదా యంత్రాలు వచ్చినయి. అయినా వాటినీ వాళ్లె నడపాలికదా?" అన్నాడు. అప్పుడు ప్రసాదుకు జాషువా పద్యాలు గుర్తుకురాసాగాయి. ఎం.ఎ. చదివే రోజుల్లో ఆధునిక సాహిత్యాన్ని ఔపోసన పట్టాడు. గబ్బిలం కావ్యాన్ని ఎన్ని సార్లు చదివాడో, తరతరాల నుండి మాల మాదిగలకు జరుగుతు వొచ్చిన అన్యాయానికి అంగలార్చాడు. ఇకనైన, ఇప్పుడైన ఎంతో కొంత మేలు వాళ్లకు చేయాలన్నదే ఆయన ఆరాటం. ఉద్యోగరీత్యా అలాంటి అవకాశం తనకు అనుకోకుండా వొచ్చింది. తాను గ్రామ సభను ప్రారంభిస్తూ-

"గ్రామ వాసులార, మన వంతెనపని సంబంధిత శాఖ చేపట్టింది. మీ అందరి సహకారం కూడ వుంటె అది తొందరగా పూర్తవుతుంది, వేరు వేరుగ వున్న ఒకే ఊరు దగ్గర అయిపోతుంది. అదో చూడముచ్చటగ కళ్లజోడులాగ కనిపిస్తుంది" అన్నాడు ప్రసాదు.

ఉన్నట్టుండి మాజీ సర్పంచ్ స్పృహతప్పి చెట్టు మొదట వరిగిపోయాడు. పక్కనున్నవాళ్లు పట్టుకొని పడుకోబెట్టి కండువాతో గాలి విసురుతువున్నారు. ఆయన కళ్లు మూతలు పడే వున్నాయి. తాను చావట్లో అట్లా పడిపోవడం ఓ మాదిరిగా చిన్నతనంగద అని ఓ వైపు పీకుతువున్నా తప్పదని మనస్సును సరిపెట్టుకున్నాడు. కదలకుండా వుండిపోయాడు. అప్పుడు అతనికి భారతం కథలు గుర్తొచ్చాయి. కురుక్షేత్ర యుద్ధంలో అర్జునుని బాణపు వేటుకు కుంగిన తన రథచక్రానికి భుజం అనించే లేపుకుంటున్న కర్ణుడు గుర్తొచ్చి తమాయించుకున్నాడు, శ్వాస ఆడుతూనే వుంది. కాని శరీరం ఓ మాదిరి కంపనానికి గురై వల్లంత చెమట చిమ్మింది. ఆయన కనురెప్పల కింద గతం కదలాడింది.

ఆయన తాత పేరు నర్సింగ్‌రావే. ఆయనకు ఇద్దరు కొడుకులు పెద్ద కొడుకు పేరు నరేందర్‌రావు. చిన్న కొడుకు చందర్‌రావు బాపు పెదబాపు నరేందర్‌రావు ఇరువైఏండ్ల ప్రాయంలో మాదిగ వాడలోని ఓ అమ్మాయిని ప్రేమించాడట. వాళ్లిద్దరు ఒకరినొకరు వొదిలి వుండేదికాదట. చేలల్లో చెలుకల్లో కలిసి తిరుగుతువుండేవాళ్ళట. ఆమె తండ్రి తాత దగ్గరే పెద్ద జీతగాడు. అతని శ్రమ, శ్రద్ధ వల్లనే మా ఇంట్లో పాడి-పంటలు పెరిగాయట. వాళ్ల కుటుంబానికి హాని తలపెట్టె ఆలోచనను తాత అనచుకున్నాడు. పెద్ద కొడుకు నరేందర్‌రావుకు పెళ్లి తలపెట్టాడు. పెదబాపుమో ఆమెనె చేసుకుంట అని పట్టుపట్టాడట. కులంగాని కూడు వద్దన్నా వినలేదు. వీళ్లు కలుసుకోకుండ వుండడానికి ఊరిపైన పడమట వున్న పెద్ద చెరువు నుండి తూర్పు వైపు మాదిగవాడకు ఊరికి మధ్య నుండి ఓ కాలువను తవ్వించాడు. ఆ రోజుల్లో మూసినది నిరంతరం పారడంవల్లా ఆ చెరువు నిండుతు కాలువ పారుతువుండేది. పెదనాన్నకు ఆ కాలువ దాటం పెద్ద పనేమికాలేదట. రోజు కాలువదాటి ఆమెను కలుస్తూవుండేవాడట. అది చూసిన తాతయ్య ఆమెను చంపించి కాలువలో కాలుజారి పడిపోయిందని నమ్మించాడే కాని మరునాడె పై చెరువులో తన కొడుకు శవం తేలుతుందనుకోలేదు. హత్య, ఆత్మహత్యల గురించి ఆ ప్రాంతమంతా కథలు కథలుగా చెప్పుకున్నది తాను ఒకప్పటి వరకు విన్నాడు.

అందుకె ఆ కాలువ మీద వంతెన నిర్మించడం తనకు ఇష్టంలేదు. వంతెన నిర్మిస్తె మల్లేదన్న వర్ణ సంకరం జరిగే అవకాశం వుండొచ్చు అని అనుమానం. ఆందోళన. అన్నేండ్లు ఊరి సర్పంచ్‌గ చేసి నాలుగు కాలాలు చూసి ఈ కాలం వరకు ఇంకా బ్రతికివున్న, ఆయనకు అది తగిందికాదు. కాని ఆయన మనస్తత్వం అట్లాంటిది అదంతె. కాలాన్ని బట్టి మరె ప్రయత్నం చేయలేదు. కాకపోతే కాస్త గొంతులో మార్పు తెచ్చుకొని కాస్త దగ్గరితనంగా మాట్లాడడం నేర్చుకున్నాడు. అది రాజకీయాలలో వస్తూ వున్న మార్పులు ఆ మాత్రం మారడానికి పనిచేసాయి. కాని ఆయన చూపులో, నడకలో దొరతనం కొట్టొచ్చినట్టు కనిపిస్తయి.

"దొర పడిపోయిండని" అక్కడున్న వాళ్లంతా ఆందోళనగా చూస్తూ వుండిపోయారు. ప్రసాద్ నీళ్లు తెప్పించి ముఖంమీద చల్లుతు, కదలించి "నర్సింగ్‌రావు గారు, నర్సింగ్‌రావుగారు" అని పలుకరించాడు. కాసేపటికి కదిలి కళ్లు తెరిచి చూసాడు.

"ఏమైందండి, ఎందుకిలా పడిపోయారు" అని అడిగారు ప్రసాదు.

'పడిపోతే లేచి కూర్చుంటాను. కాని తరతరాలుగ వస్తున్న మా దొరతనం మాత్రం పూర్తిగ మళ్లీ లేవకుంట పడపోతుందేమో అని నా బాధ' అని మనస్సులో అనుకుంటు నొదిటికి పట్టిన చెమటను దోతి కొంగుతో తూడ్చుకుంటు లేచి కూర్చున్నాడు.

'వంతెన నిర్మాణం తప్పదా ప్రసాదుగారు' అనుకుంటు ప్రసాదుగారి వైపు చూశాడు. ఆయన మనస్సులో వున్న విషయం ప్రసాదుగారికి ఎట్లా తెలుస్తుంది. అందుకని ప్రసాదు జనంవైపు చూస్తు రేపు మీ చేతుల మీదుగానె పనిని ప్రారంభిస్తారు". ఇంతటితో ఈ సభ ముగుస్తుంది. మన సర్పంచ్‌గారు వందన సమర్పణ చేస్తారు" అని కూర్చున్నాడు. ఇంత సేపు ఓపిగ్గా విన్న జనం ఒక్కసారె మాటల్లోకి దిగారు.

"మీరంత వచ్చి ఈ గ్రామ సభ విజయవంతం చేసినందుకు అందరికి ధన్యవాదాలు. ముఖ్యంగా మన నోడల్ అధికారిగారు మనమీద వున్న ప్రేమతోటి మన ఊరిని బాగుచేయాలని పట్టుదలతో పనిచేయిస్తున్నారు. మనమంతా ఆయనకు సహకరించవల్సి వుంది. ఇంతటితో ఈ సభ ముగిసింది". అంటూ ప్రకటించారు.

0 0 0

వంతెన పని ప్రారంభం నాడు మాజీ సర్పంచ్ తాపితో మాల్‌వేసెటపుడు చేయి వణికింది, అందరు చూసారు. అందుకు కారణం ఇన్నాళ్ళ వాళ్లకు అన్యాయం తలపెట్టినందుకు కావచ్చు.అందరి సహకారంతో వంతెన నిర్మాణపు పని ముగిసింది. ఆ ప్రాంతపు శాసనసభ్యుడు ఆ వంతెనను ప్రారంభించాడు. జిల్లా అధికారులంతా వచ్చారు. వంతెన మీది నుండి రాకపోకలు సాగినయి. ప్రారంభ సభలోనే ఊళ్లోకొచ్చె బస్సు విషయం మాట్లాడుతూ "రేపటి నుండి ఈ ఊళ్లోకొచ్చె బస్సు వంతెనమీదినుండి అవతలివాడవెళ్లి తిరిగిరావటం వల్లా అందర్కి సౌకర్యంగా వుంటుంది. అంతెకాదు చివరి బస్సు అక్కడే ఆగి తెల్లారి అక్కడినుండె మొదలు కావడానికి ఆర్‌టిసి వాళ్లు అంగీకరించారని కూడ ప్రకటించాడు" ప్రసాదు.

అది విన్న జనంలో ఏవో గుసగుసలు బయలుదేరినయి. కాని ఎవరు బయటికి అనలేక పోతువున్నారు. నర్సింగ్‌రావు చంద్రారెడ్డి గారి వైపు మౌనంగా చూసాడు. "వంతెన కావాలనుకున్నారు, వచ్చింది బస్సు మాత్రం నడివూల్లో చావడి వరకొచ్చి అక్కడినుండె మళ్లిపోతుంది. అట్లా పోతెనే మంచిది. కాని

అవతలి వాడవరకు వెళ్లనవసరం లేదు" అన్నాడు చంద్రారెడ్డి. గ్రామ పెద్దలకు భరోసనిస్తున్నట్టు.

"అంతెగదు" అన్నాడు నర్సింగ్‌రావు. తాను అనవల్సింది ముందే మరొకరు అన్నందుకు జనాభిప్రాయాన్ని బలపర్చినట్లుగా చూశాడు.

వాళ్లు ఎందుకిట్లా మాట్లాడుతున్నారో ప్రసాదుకు అర్థం కావటంలేదు.

"వాళ్లకు ఇండ్లు కట్టించారు, వాళ్ల వాడకు వంతెన కట్టించారు, బర్రెలనిచ్చారు. గొర్రెలనిచ్చారు, మేందేనిని కాదనలేదు. కాని బస్సు మాత్రం నడి ఊళ్లోకొచ్చి నడివూళ్లో నుండె పోవాలి అంతె అన్నాడు మాజీ కర్ణం కిషన్‌రావు. ఆయన వక్ర ఆలోచనలవల్లనె ఆ ఊరు చెందవల్సినంత అభివృద్ధి చెందలేదు. జనాన్ని ఎప్పుడు భూ తగాదాల్లో, గెట్ల పంచాయతీలల్లో కోర్టుల చుట్టూ, పోలీసు స్టేషన్ల చుట్లు తిప్పుతు వచ్చాడు. ఊళ్లో ఒక్క దొరతో మాత్రమే మంచిగా వుంటూ ఊరందరిని ఉరకలు-పరుగెత్తిస్తూ వస్తువుండేవాడు. పంచాయతి వ్యవస్థ వచ్చినాక పట్వారి వ్యవస్థ మారి కాస్త తగ్గాడు. అయినా ఏ మూలనో ఎవరిమీదనో తన పాచికలు వేస్తూనే వుంటాడు. ఈసారి ఈ పాచిక వేసినట్టుంది. ఊరి పెద్దలంతా కూడ బస్సు చావడి నుండె తిరిగి వెళ్లాలని పట్టు పట్టారు. ఊరు నిమ్మలంగా వుంటె ఆయనకు అస్సలు నిద్రపట్టదు. ప్రసాదు ఎంత నచ్చచెప్పిన ఎవ్వరు వినటంలేదు. ఒక దశ ఈ ఊళ్లోకి బస్సు రానేవద్దు అన్నారు. వంతెన వైపు మళ్లిన బస్సు మీద రాళ్లు రువ్వారు. అద్దాలు పగులగొట్టారు. ఊరంతా ఒక్కటై వద్దంటె వద్దన్నారు ప్రసాదును నిలదీసారు. ఎదురు తిరిగారు. గొడవను సృష్టించారు.

ప్రసాదు పోలీసులను పిలిపించాడు. పోలీసులు లాఠీలు చూపిస్తె జనం రాళ్లు రువ్వారు. పెద్ద గొడవే జరిగింది.

ఊళ్లోకి వచ్చిన బస్సు చావట్లోనె ఆగిపోయింది. బస్సు వస్తుందని మురిసిన దళితులు అది చూసి నివ్వెరపోయారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన సౌకర్యాన్ని ఎవరో ఎందుకు ఆపాలి. అంతెకాదు బస్సు వచ్చి పోవల్సిందేనని దళితులంతా పట్టుపట్టారు. ఒకరోజు పొలం పనులకు పోకుండా తమ నిరసనను తెలియజేసారు. బస్సు తమ వాడ వరకు వచ్చిపోవల్సిందెనని పట్టుపట్టారు.

వంతెన తరువాత దళిత వాడలో కదలిక మొదలైంది. పిల్లలు బడికొచ్చి పోతున్నారు. వయసు పై బడినవాళ్లు ఊళ్లోకి వచ్చిపోతు చుట్ట, బీడి కొనుక్కుంటువున్నారు. కూలీలంత కలుసుకొని కష్ట-సుఖాలు కలెపోసుకుంటువున్నారు ఊరికె ఓ కొత్త ఊపొచ్చింది.

బస్సు పంచాయతి ఊరంతా కలవరపెట్టింది. చాటుగ నోడల్ అధికారిని తిట్టిపోస్తుపున్నారు. గ్రామ పెద్దలు సెగలు-పొగలతో తిరుగుతు వున్నారు.

ఒకరోజు ఉదయం దొర, కరణం, భూసాములు, ఆసాములు అందరు కలిసి నోడల్ అధికారి జీపును ఘెరావ్ చేసారు. అంతేకాదు ఏదో చెప్పాలని ప్రయత్నిస్తున్న ప్రసాదు మాటలకు అడ్డు తగిలి మాట్లాడనీయలేదు.

"ఈ ఊరి వాళ్ల సంగతి నీకు ఇంకా పూర్తిగా తెలియదు. కంగాలి కొడుకుల వెంటేసుకుని ఏమేమో చేయాలని చూస్తుపున్నావు. అదెంకుదరదు నీ పద్ధతిని మార్చుకోవాలి సుమా ?" ఊరు తెలివి మీరితె తన భూమి తగ్గుతుందో ఏమో అనే భయంతో అన్నాడు ఓ భూసామి.

"చేయించినవరకు చాలు ఇక ఆపేసి మరో ఊరును చూసుకోండి" అన్నాడు మరో ఆసామి కూలి బస్సెక్కితే ఊళ్ళో ఉండన్న భయం ఆయనను కలవరపెట్టినట్టుంది.

"వంతెన వద్దన్నాను" అని గుర్తుచేసాడు. నర్సింగ్‌రావు. తాను అన్నట్టే దాని వల్ల ఊరికే ముప్పు వచ్చింది కదా అన్నట్టు చూశాడు.

"చేయించినవరకు చాలు అంటున్నాంగా, ఏ పరిస్థితులలోను బస్సు అక్కడివరకు వెళ్లొచ్చె వీలులేదు. కాకుంటె ఈ ఊరికి బస్సు నడపకున్నా పరవాలేదు. మొదటినుండి ఈ బస్సుల్లో తిరిగే బ్రతికినమా" అన్నాడు మాజి కరణం. మార్పును భరించలేని మనిషి.

"ఆ ఎక్కడమేదో ఈ చావడికొచ్చి ఎక్కొచ్చుగ. వాళ్ల ఇండ్లముందరకి పోవాలనా? ఎంతదూరం కూతపెట్టు అంతె వెనకట ఆమెడలకొద్ది నడిచినోళ్లుకాదా?" అన్నాడు మాజీ కరణం మళ్ళీ తానే ప్రసాదు వైపు చూస్తూ... ఆయన పంచె కట్టడంలో, ఆకు నమలడంలో పూర్వ వైభవం కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది.

ప్రసాదుకు కాసేపు ఏం తోయలేదు. మౌనంగా నిలుచున్నాడు.

"అయితే ఈ విషయాన్ని కలెక్టరుగారి దృష్టికి తీసుకెళతాను" అంటూ జీపు ఎక్కి "వెనక్కు మలుపు" అన్నాడు.

సరిగ్గా అప్పుడె ఏబదేండ్ల వ్యక్తి తలకు ఎర్రటి గీతల రుమాలు, చేతిలో కొమ్ములు నరికె చిప్పగొడ్డలి, సంకలో నల్లని సుక్కిన గొర్రెపిల్లతో వచ్చి ప్రసాదుకు నమస్కరించాడు. అతన్ని చూసి "ఆ చెప్పు యాదవ్. ఏం సంగతి" అన్నాడు ప్రసాదు చిరునవ్వుతో.

"ఏంలేదు దొర. గీ గొర్రెపిల్ల సుక్కింది. దావఖానకు తీసుకపోవాలె.

ఊయల్ల బస్సు నడువదట. చావట్లో దాని పయ్యల్లో గాలి తీసేసింర్రు, జర జీపుల తీసుకపోతరేమోనని" అంటు మరోసారి చేతులను ఎదవరకు ఎత్తిదించాడు. ఏడు పదులను ఎక్కడ దాచాడో ఏబదేండ్లవాడుగ కనిపిస్తున్నాడు. కుడి చేతి మణికట్టుకు వెండి పోంచి ఎడమచేతి ముంజేతికి వెండి కడియం, చెవులకు బంగారు కొలిక పోగు నడుంకు వెండి మొలతాడుతో ఉన్నాడు.

"అంతెనా కూర్చో," అన్నాడు వెనక సీటు చూపిస్తు.

యాదవ్ కూర్చున్నాక జీపు స్టార్ట్ అయి మేన్‌రోడ్డు వైపు పోతుంది.

"గొర్రెల పెంపకానికి లోనిస్తరట. మా పేదోల్లకేమైనా సాయం చేస్తరా? సారు" అన్నాడు

"చేస్తరు. ఇంతవరకు ఎందుకు ధరఖాస్తు చేసుకోలేదు" అని అడిగాడు ప్రసాదు.

"మాకెవ్వరు చెప్పలేదు. ఆ దొరోడు అన్నేండ్లు సరపంచ్‌గవుండి ఎవరికేం చేసిందు మాకేమన్న చెప్పిండా, చేసిండా అసలు ఊరి గురించి ఏం పట్టిచ్చుకుండని" అంటు దొరమీదున్న అక్కసును కక్కాడు.

"పోయింది పోనీ. ఇకనుంచి ఎవరికి ఏ లోను కావాలన్న మండలాఫీసులో ధరఖాస్తులు ఇవ్వండి. ఇచ్చి వూర్కోవద్దు సుమా ఒకటికి రెండుసార్లు ఆఫీసుకు వెల్లి గుర్తుకూడ చేసిరావాలి లేదా ఆఫీసర్లు మీ ఊరొచ్చినపుడు గుర్తుచేస్తువుండాలి. నేను ఈ ఊరికి రాబట్టి సంవత్సరం దాటింది. మీరెవ్వరు నన్ను ఎప్పుడు కలువలేదు, ఏమి అడగలేదు"అన్నాడు.

"ఇప్పటివరకు ఎవరొచ్చిన, ఆ దొరోనింట్లోనె తిని తాగి, ఆనితోనే మాట్లాడిపోతరు. ఆడు ఎవరితో కలవనివ్వడు. మాట్లాడనివ్వడు" అంతేకాదు బడి అని చేతులనె, గుడి అని చేతులనె. తీర్మాణాలు చెప్పేది ఆడేనాయె, ఎవరన్న ఎదురు మాట్లాడితె ఏదో కేసుల ఇరికియ్యబట్టే ! అన్నీ ఎవరడిగెటట్టుంది. ఆడు ఆడిందె ఆట పాడిందే పాట అంతే వాడు మనిషి కాదు తొడేలు!" అన్నాడు యాదవ్. అప్పుడు యాదవ్ ఎదలోనుండి ఏదో భాగ ఎగసిపడినట్టు ఎద బాగా కదులుతూ వుంది.

ప్రసాదు వింటువున్నాడు. జీప్ నడుస్తువుంది.

డ్రైవర్ మాటల మద్యకొస్తు "ఇంతకి నీకు ఎన్ని గొర్రెలున్నయి బోయుడా" అని అడిగాడు.

"వున్నయి పిల్లబిట్టా ఓ వందవుండొచ్చు" అన్నాడు.

"అమ్మ వంద గొర్రెలే!" అన్నాడు ఆశ్చర్యంగా డ్రైవర్. 'చూడడానికి

గోచిగొంగడె కాని వాళ్ళ వెంట గొర్రెలెగొర్రెలు. పెద్ద మంద ఒక్కొక్క గొర్రె ఓ వెయ్యి రుపాల నోటు' అని మనస్సులో అనుకున్నాడు డ్రైవర్.

"ఆ అవన్నీ బతికి బట్టగడితేగదా, నక్కలు, తొడేళ్లు తినవు. అంతెందుకు రోగాలొచ్చి ఎన్నిపోవు?"

"రోగాలొస్తె పసుల డాక్టరులేడు. మీరు పోకున్న ఊళ్లోకి రాడూ" అని అడిగాడు డ్రైవర్.

"ఇగ ఊళ్లోకి వచ్చి చూస్తాడూ. ఒక కల్ల చూసినా అప్పటికప్పుడు పదో పరకో ఇవ్వాల్సిందే" అన్నాడు.

"నిన్న మొన్నటిదాక బస్సేలేదాయె. ఆయన ఊళ్లోకొస్తె చెపితిగ దొరోరి పసులు, దొరోరి గొర్రెమందను చూచెసరికి సరిపాయె మా అస్సొంటల్ల బక్క జీవాలను చూసేటట్టుంటాది సారు" అని అన్నప్పుడు ఆయన గత అనుభవం కల్లలో కదిలింది.

"దొరకు గూడా గొర్రెలున్నాయా" అడిగాడు డ్రైవర్.

"ఓ వందలు. ఊరందరికి ఎన్ని గొర్రెలున్నయో దొరకు అన్నీ వున్నయి. కాసె మనుసులున్నరు మేసే కంచె బీడుంది. ఆయనకేంతక్కువ తాను తప్ప ఊళ్లో ఎవరు ఎదగొద్దు. కల్లు దొంగని ఒకనికి, కట్టెల దొంగని ఒకనికి, రంకు నేరం ఒకనికి అన్నీ నేరాలను అందర్కి అంటకట్టి ఆడిస్తుండే కాని నిజానికి ఆడె ఓ పెద్ద దొంగ." అన్నాడు యాదవ్. ఎన్నడు దొరమీద నోరు విప్పనోడు ఈరోజు అడక్కుండానే అన్నీ తానే అనేస్తున్నాడు. ఆనకి మాల - మాదుగులంటే అస్సలు పడదు. తమరేమో వాళ్ళను ఎనకేసు కొస్తున్నరు. అందుకే మిమ్ములను ముందుకు సాగనియ్యటం లేదు.

"వాళ్ళంత ఏం తెలియని ఎడ్డి సన్నాసి గాళ్ళు. వాళ్ళను కాదంటే ఎట్లా. చావుకు నొముకు పనికొచ్చెటోళ్ళు. స్వార్థం లేకుండా చాకిరి చేసేటోళ్ళు" అన్నాడు. అవన్ని ఆల్లు, ఆలోచించరు. పోగ ఈనంగా చూస్తు చస్తున్న పట్టించుకోరు. ఒకసారి ఎం జరిగిందంటే ఇదే దొర పోలంలో వరిచేలో మందు చల్లుతున్న జీతగాడు మందును పీల్చడం వల్లా శోషవచ్చి బురద మడిలోనే కుప్పకూలి పోయాడు. అతని బుజాన మందు కొట్టె మిషన్ వుంది. అది బురదులో కురకపోయింది. అతనేమో కళ్ళు తేలగిలేసి కాళ్ళు - చేతులు కొట్టుకుంటువున్నాడు. మిగతా జీతాగాళ్లంతా దూరంగా తలా ఓ పనిలో మునిగి వున్నారు. దొర పక్కన్నే వున్న బావిగడ్డ మీదుండి నిలబడి చూస్తున్నాడంతె కాని దగ్గర్కి పోయి లేబట్టలేదు. కనీసం బూజానికి కున్న

మందు కొట్టె మిషన్ నన్న వేరు చేయలేదు. నేనప్పుడు గొర్రెపిల్లలకు రాగి ఆకు మండలను కొడుతు రాగి చెట్టు మీదున్న. నేను దిగొచ్చి మడిలోకి పోయి బుజానికున్న పంపును వేరు చేసి వరం మీద పడుకొపెట్టిన. ఈ లోపల మిగతా జీతాగాళ్ళు వచ్చి అతన్ని ఎడ్లబండి మీద దవకానకు తీసుపోయింద్రు. కాని బతకలేదు చాల ఆలస్యం చేసింద్రని అన్నడాట డాక్టరు. 'పడగానే లేపి విషాన్ని కక్కిపిస్తే బతికేటోడే.

"వాడు మనిషికాదు రాక్షసుడు. తోటి మనిషి అందులో తన పొలంలో పని చేస్తు పండించేటోడు. అదే పనిలో అపాయనికి గురియైతే అంటరానివాడని అట్లాగే నిలుచుంటడా? మనకు చాకిరి చేసెవాళ్ళను మనం పట్టించుపోతె ఎట్లా. మనం చచ్చినంకా మన శవాలను కాల్చేది వాళ్ళె. బూడిదను కుప్పజేసేది వాళ్ళె ! నిజంగా యాదవ్ వాళ్ళకు మనం చాల రుణపడి వున్నాం. ఇప్పుడు కాలం మారింది. ఇప్పుడైనా వాళ్ళను మనం మనలోని మనుషులుగా చూస్తు మనలో కలుపుకోవాలి సుమా !" అంటు వెనక్కు మళ్ళి యాదవ్ ముఖంలోకి చూశాడు.

"అంతెకద సారు" అన్నాడు యాదవ్.

"కాలంతో పాటు మనమూ మారాలంతె" అన్నాడు డ్రైవర్.

"నిజమె కాని కొందరిలో ఇంకా వెనకటి పద్ధతులే నాటుకొని వున్నాయి." అని అంటున్నప్పుడు–

"అంతెందుకు చావు ఖర్చులు గూడ సరిగా పెట్టుకోనందుకు ఊరంత ముక్కుమీద వేలేసుకోన్నరు. దొరోనికి కొపం మొస్తదని నోరు మూసుకునిరి" అన్నాడు యాదవ్.

సెల్ మోగింది. చెవిదగ్గరవుంచుతు "హల్లో" అన్నాడు ప్రసాదు.

"హల్లో సి.ఐ.ని మాట్లాడుతున్న. ఎట్లా వుంది నాగారం పరిస్థితి" అడిగాడు సి.ఐ.

"ఓ కొలిక్కి వస్తుంది"

"మిమ్ముల ఘెరావ్ చేసింద్రని ఎవరో ఫోన్ చేశారు. మా వాళ్ళనేమన్న పంపమంటారా?" అడిగాడు సి.ఐ.

"నేను చూసుకుంటాను లెండి. అవసరముంటె ఫోన్ చేస్తాను"

"మరి చావట్లో జరిగిన సంగతేమిటి. మీ ముందే జరిగిందా?"

"ఏం సంగతి"

"మీకు తెలియదా? ఇద్దరు దళితులు బస్సెక్కడానికి చావట్లోకొస్తె మీ

వల్లనే ఊళ్ళో తగాదాలు తలెత్తుతున్నాయి. మీ ఇండ్ల దగ్గర్కి బస్సు రావాల్నా" అని కొట్టారట.

"మాకు తెలువదు దొర. మేమే చావడి దగ్గర బస్సెక్కాలని వొస్తిమి మేమెందుకన్నం దొర. ఒంట్లో రక్తం లేనోల్లం మమ్ముల కొట్టకండ్రి దొర" అని కాళ్ళు పట్టుకున్న వినలేదట. సర్‌పంచ్ గారు లేరట. ట్రాన్స్‌ఫార్మర్ కోసం ఎలక్ట్రికల్ ఎఇ దగ్గర్కి వెళ్ళాడట. నర్సింగ్‌రావు, కిషన్‌రావు అక్కడే చూస్తూ నిలుచున్నారట కాని ఆప కూడ ఆపలేదట. అసలు వాళ్ళే ఆ ఘర్షణకు కారకులని ఊళ్ళో చెప్పుకుంటున్నారు.

"అంతేకాదు బస్సు అద్దాలు పగులగొట్టిండ్రని, టైర్లల్లోగాలి తీసేసిండ్రని వాళ్ళమీద కేసు బనాయించమని గ్రామ కార్యదర్శిపై వత్తిడి తెస్తున్నారట". ఆయనే మాకు ఫోన్ చేసాడు. మేం బయలుదేరి వస్తున్నం." అంటూ సి.ఐ. సెల్ ఆఫ్ చేసాడు.

"యాదవ్ ఇప్పుడు నీకర్థమయిందిగ బస్సు నడవకపోతె ఎంత ఇదో, నీవు దావకానకు పోకపోతే నీ గొర్రెపిల్ల చచ్చిపోవచ్చు నీకెంత నష్టం. అట్లాగె రేపు ఓ మనిషికి ఆపదరావచ్చు ఎట్లా చెప్పాలయ్యా మీ ఊరివాళ్లకు. వంతెన అవతలికి బస్సు పోయిరావద్దు అంటు పట్టుపట్టిండ్రు." అన్నాడు ప్రసాదు వెనక కూర్చున్న యాదవ్ వైపు మళ్లి.

యాదవ్ ఏదో రహస్యం చెపుతున్నవాడిలా ముఖంపెట్టి "ఇంకా తమరు ఆ సంగతి తెలుసుకోలేదా సారు. ఊరి పెద్దలు అందరు ఒక్కటైండ్రు" అని ఆపాడు యాదవ్. అప్పుడు గొడ్డలి ఆయన తొడల మధ్య నుండి గదవకింద వుంది.

"ఆ ఒక్కటై"

"ఏంలేదు బస్సు వంతెన దాటి పోయి మళ్లితె"

"మళ్లితె..."

"మొదట వాళ్లే ఎక్కి కూర్చుంటె. తరువాత చావట్లోకి వచ్చినంక పెద్ద కులాల వాళ్లు ఎక్కి నిలుచుండవల్సివస్తదని".

ప్రసాదు ముఖంలో ప్రశ్నార్థకం ఆ తరువాత ఆశ్చర్యార్థకం రెండు కదిలాయి!?

కథా నిలయం
5479
శ్రీకాకుళం

మే 2003.